క్లుప్తంగా

విద్యార్థినులు ఉన్నత స్థాయికి చేరాలి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే

మార్కాపురం టౌన్: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని సబ్ కలెక్టర్ త్రివినాగ్, ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో 125 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారిణి అరుణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలి


పొలాన్ని పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి రమేష్

మార్కాపురం రూరల్: అకాల వర్షాల నేపథ్యంలో మిరప, బత్తాయి, జామ తోటల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలని మార్కాపురం ఉద్యానవనశాఖాధికారి దాసు రమేష్ వివరించారు. సోమవారం తిప్పాయిపాలెం, బిరుదులనరవ గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉరకెత్తిన పొలాల్లో మొక్కలు వెంటనే తేరుకోడానికి లీటరు నీటికి 10 గ్రాముల యూరియా, 10 గ్రాముల పంచదార ద్రావణాన్ని కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. మొక్కలు తలవాల్చినట్లయితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలని చెప్పారు.

మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించాలి

- సీపీఎం మార్కాపురం కార్యదర్శి రఫీ


రఫీ, సీపీఎం పట్టణ కార్యదర్శి

మార్కాపురం: మార్కాపురాన్ని ప్రభుత్వం వెంటనే జిల్లాగా ప్రకటించాలని సీపీఎం మార్కాపురం పట్టణ నూతన కార్యదర్శిగా నియమితులైన డీకే ఎం రఫీ డిమాండ్ చేశారు. సీపీఎం మార్కాపురం పట్టణ 10వ మహాసభల్లో రెండో రోజైన సోమవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వమే మెడికల్ కాలేజీని నిర్మించాలని, డాక్టర్ల బదిలీలను నిలుపుదల చేసి కాలేజీ నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. మార్కాపురం పట్టణంలో అన్ని వార్డులకు సాగర్ నీటిని అందించాలని, టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని అన్నారు. మార్కాపురంలో గవర్నమెంట్ జూనియర్ కళాశాల, డిగ్రీ, పీజీ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. మార్కాపురం చెరువు కట్టను అభివృద్ధి చేసి మినీ ట్యాంక్ బండ్‌గా మార్చాలన్నారు. పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు మొదటి సొరంగం ద్వారా నీటిని విడుదల చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీ సభ్యులుగా సోమయ్య, రూబెన్, జె.రాజు, ఎస్కే నన్నేసా, బి.కాశయ్య, జి శారాను సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రమేష్ పాల్గొన్నారు.

తెల్లశనగ.. సర్కారు దగా!

ప్రభుత్వం అందించిన తెల్లశనగ విత్తనాలతో రైతుల పరేషాన్

- పొలంలో విత్తి నెల రోజులు దాటినా మొలక రాని వైనం
- ఒక్కో ఎకరాకు రూ.20 వేలకు పైగా నష్టం
- సమయం, శ్రమ కూడా వృథా అయిందని రైతుల ఆందోళన
- మొలక రాని రైతులకు మళ్లీ విత్తనాలిస్తున్నట్లు ఏఓ వెల్లడి
- జరిగిన నష్టం ఎవరు భరించాలని ప్రశ్నిస్తున్న రైతులు


కొమరోలు : సూరవారిపల్లె గ్రామం వద్ద మొలకరాని తెల్లశనగ పంట

కొమరోలు: ''పంటలు సాగు చేసే ముందు మంచి విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. విత్తనాలు, ఎరువులు కొనే ముందు బిల్లులు తప్పనిసరిగా తీసుకోండి. నాసిరకం విత్తనాలు రైతులకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం'' ఇవీ వ్యవసాయ, అనుబంధ శాఖల రైతులు తరచూ చెప్పే మాటలు. విత్తన డీలర్ల సంగతి అటుంచితే.. ఏకంగా ప్రభుత్వం సబ్సిడీపై మంజూరు చేసిన విత్తనాలే నాసిరకంవి కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రాయితీపై అందించిన తెల్ల శనగ విత్తనాలు వందలాది మంది రైతులను నట్టేట ముంచాయి. తెల్లశనగలు విత్తి నెల రోజులు గడిచినప్పటికీ మొలక రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది నవంబరు 14వ తేదీ నుంచి కొమరోలు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో 1614 క్వింటాళ్ల తెల్లశనగలు, 1223 క్వింటాళ్ల ఎర్ర శనగలను రైతులు కొనుగోలు చేశారు. అధిక దిగుబడి వస్తుందనే ఉద్దేశంతో మండలంలోని రైతులు ఎక్కువ భాగం తెల్లశనగలు సాగు చేశారు. అదే సమయంలో విత్తిన ఎర్ర శనగలు మొలక రాగా తెల్లశనగలు మాత్రం మొలకెత్తలేదు. కొన్ని గ్రామాల్లో మొలక శాతం చాలా తక్కువగా ఉండటం రైతులను ఆందోళనలోకి నెట్టింది.

సబ్సిడీలోనూ కోత

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్నదాతలకు ఇచ్చే విత్తన సబ్సిడీపై కోత విధించింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు పప్పుశనగ విత్తనాలపై 40 శాతం సబ్సిడీ అందించేవారు. కూటమి ప్రభుత్వం 40 శాతం సబ్సిడీని కాస్త 25 శాతానికి కుదించింది. ఈ పరిణామం శనగ సాగును భారంగా మార్చినా రైతులు విధిలేని పరిస్థితిలో విత్తనాలు కొనుగోలు చేశారు. ఈ ఏడాది జె.జి-11 రకం శనగలు క్వింటా ధర రూ.9400 కాగా 25 శాతం సబ్సిడీపోను రూ.7050, కేఏకే-2 రకం శనగలు క్వింటా ధర రూ.12100 కాగా సబ్సిడీ పోను రూ..9075ను రైతులు చెల్లించారు. ప్రైవేట్ మార్కెట్‌లోనూ దాదాపు ఇవే ధరలు ఉన్నాయి. అయితే మొలక శాతంపై నమ్మకంతో ప్రభుత్వం అందించిన విత్తనాలను రైతులు కొనుగోలు చేయగా.. అవి కూడా మొలకెత్తకపోవడంతో రైతులు డీలా పడిపోయారు. ఎకరాలకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేసినా ఫలితం లేదని, ఈ నష్టాన్ని ఎవరు భరిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

మొలకలు పతలాగా వచ్చాయి



నేను కౌలుకు తీసుకున్న 5 ఎకరాల పొలంలో నెల రోజుల క్రితం తెల్లశనగ సాగు చేశా. ఎకరాకు 20 వేల రూపాయల వంతున ఖర్చు అయింది. కానీ ఎర్ర శనగలు వచ్చినంత మెండుగా తెల్ల శనగలు మొలక రాలేదు. చాలా పతలాగా మొలకలు వచ్చాయి.

– వరద వీరయ్య, మిట్టమీదిపల్లె

3 వారాలు దాటినా మొలక అంతంతే..



నేను 1.50 ఎకరాల పొలంలో తెల్లశనగ విత్తనాలు సాగు చేశాను. 3 వారాల క్రితం పంట వేసినప్పటికీ అంతంత మాత్రం గానే మొలకలు వచ్చాయి. ఇప్పుడేం చేయాలో అర్థం కావడం లేదు. పంట చెడగొట్టి మళ్లీ విత్తాలన్నా భారం అవుతుంది.

– వర్రా గురువయ్య, మిట్టమీదిపల్లె గ్రామం

ప్రభుత్వమే పరిష్కారం చూపాలి



నేను ఏటా తెల్లశనగ పంట సాగు చేస్తా. అంతకు ముందు కాపు బాగా వచ్చింది. కానీ గత నెలలో ఒకటిన్నర ఎకరాల్లో తెల్లశనగలు విత్తితే మొలక సరిగా రాలేదు. అధికారులు మా భూములు పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నాం.

– గుంటూరు చిన్నలక్ష్మయ్య, నరసింహునిపల్లె గ్రామం

ఏజెన్సీ వారు మళ్లీ విత్తనాలు ఇస్తున్నారు

తెల్లశనగ విత్తనాలు కొన్ని చోట్ల మొలకలు సరిగా రాలేదు. అలాంటి సమస్య వచ్చిన వారికి సంబంధిత ఏజెన్సీ వారు విత్తనాలు మళ్లీ ఉచితంగా అందిస్తున్నారు. రెడ్డిచెర్ల నుంచి భావాపురం గ్రామాల రైతులకు ఇలాంటి సమస్య ఏర్పడింది. ఇప్పటి వరకు 16 క్వింటాళ్ల తెల్లశనగ విత్తనాలను ఏజెన్సీ వారు మళ్లీ ఇచ్చారు. మొలక రాక ఇబ్బంది పడుతున్న రైతులు వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

– రాజశ్రీ, వ్యవసాయాధికారి, కొమరోలు

జెడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల చేయూత


హెచ్‌ఎంకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మెస్ నిర్మాణానికి 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు చేయూతనందించారు. పాఠశాల ప్రాంగణంలో షెడ్ ఏర్పాటుకు అవసరమైన రూ.73,216ను హెచ్‌ఎం బారెడ్డి అనూరాధకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను హెచ్‌ఎం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, పూర్వ విద్యార్థులు చీతిరాల విక్రమ్, మదు, మారుతీ ప్రసాద్‌వ శ్రీకాంత్, సుధాకర్, ప్రసాద్, వెంకటరమణ, జాకీర్, విలా కోటి, రంగస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిధులతో పశుగ్రాసం సాగు

పొదిలి రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో బహువార్షిక పశుగ్రాసాల సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఉన్నగురు వాయుపాలెం పశువైద్యాధికారి మంచికల మణిశేఖర్ పేర్కొన్నారు. పొదిలి మండలంలో మొదటి విడతగా 20 ఎకరాల్లో గ్రాసం సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.జాబ్ కార్డు కలిగి ఉండి ఐదు ఎకరాల్లోపు పొలం కలిగిన ఎస్టీ, ఎస్సీ కుటుంబాలతో పాటు, సన్న చిన్నకారు రైతులు అర్హులని స్పష్టం చేశారు. 10 సెంట్ల నుంచి 50 సెంట్లలో పశుగ్రాసం సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రైతు సేవా కేంద్రంలో లేదా పశు వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు.

భూమి ఆక్రమించారు.. న్యాయం చేయండయ్యా..

- అక్రమ ఆన్‌లైన్‌పై గ్రీవెన్స్‌లో తహసీల్దార్‌కు ఫిర్యాదు
- కన్నీటి పర్యంతమైన మహిళలు


తహసీల్దార్ కార్యాలయం ఎదుట తమ పాస్‌బుక్‌లు చూపుతున్న బాధిత మహిళలు

తర్లుపాడు: తమ భూములను అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, పాస్ పుస్తకాలు పొంది, సాగు కోసం పొలానికి వెళ్తుంటే దాడికి పాల్పడుతున్నాడంటూ ఓ వ్యక్తిపై మండల కేంద్రం తర్లుపాడుకు చెందిన ఇద్దరు మహిళలు గ్రీవెన్స్‌లో తహసీల్దార్ విజయభాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. తమ గోడు చెప్పుకొని కన్నీటిపర్యంతమయ్యారు. బాధితుల కథనం మేరకు.. తర్లుపాడుకు చెందిన షేక్ పూల మహబూబ్‌బీకి 2005లో అసైన్‌మెంటు కమిటీ ద్వారా కారుమానిపల్లి ఇలాఖాలో సర్వే నంబర్ 77/9లో రెండు ఎకరాల భూమి కేటాయించారు. ఆమె తన భర్త సహాయంతో సదరు భూమిని బాగు చేసి పంటలు సాగు చేశారు. కొంత కాలానికి ఆమె భర్త మరణించడంతో ఇదే అదునుగా భావించిన ఓ వ్యక్తి అధికారులను మభ్యపెట్టి ఆ భూమిని ఆన్‌లైన్‌లో తన భార్య పేరున నమోదు చేయించాడు. పొలానికి కంచె వేసి ఉండటాన్ని చూసి మహబూబ్‌బీ ప్రశ్నించగా అతను దుర్భాషలాడి బెదిరించాడు.

తర్లుపాడుకు చెందిన మరో మహిళ తాడిబోయన పెద్దక్కకు అనువంశికంగా చెన్నారెడ్డిపల్లి ఇలాఖాలోని సర్వే నంబర్ 170/1లోని 2.40 ఎకరాల భూమిని సైతం అధికారుల అండతో సదరు అక్రమార్కుడు ఆన్‌లైన్‌లో తమ కుటుంబ సభ్యుల పేరు మీద నమోదు చేసుకున్నట్లు తహసీల్దార్‌కు వివరించారు. తమతో అమర్యాదగా మాట్లాడుతున్న కార్యాలయ సిబ్బంది కొందరిపైనా ఇరువురు మహిళలు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ ఆన్‌లైన్‌పై విచారణ చేపట్టి, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సనాతన ధర్మ పరిరక్షణే సమరసత ధ్యేయం


పాల్గొన్న హరిహరరావు తదితరులు

మార్కాపురం: సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా సమరసత సేవా ఫౌండేషన్ పని చేస్తోందని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం మాజీ ధర్మకర్త గోపాలుని హరిహరరావు పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆవిర్భవించి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మౌలిక సదుపాయాలు లేని ప్రాంతాల్లో ఆలయ నిర్మాణాలు ప్రారంభించడం, జీర్ణోద్ధరణలో ఉన్న దేవాలయాల అభివృద్ధికి సహకరించడం, ఇంటింటికీ వెళ్లి ధర్మ ప్రచారం చేయడం లాంటివి ఫౌండేషన్ చేపడుతోందన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించడం, హిందూ సమాజాన్ని ఐక్యంగా ఉంచడం కోసం కృషి చేస్తున్నామన్నారు. సంస్థ కన్వీనర్ వేముల సుబ్బారావు, ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ రమణయ్య, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో మోస్తరు వర్షం


మార్కాపురంలో కురుస్తున్న వర్షం


గొట్లగట్టులో ముసురు పట్టిన దృశ్యం

- పెరిగిన చలి తీవ్రత

మార్కాపురం/కొనకనమిట్ల: ఫెంగల్ తుపాన్ ప్రభావంతో గత నాలుగు రోజుల నుంచి మార్కాపురం ప్రాంతంలో వాతావరణం పూర్తిగా మేఘావృతమైంది. సోమవారం తెల్లవారుజాము నుంచి పలు దఫాలుగా వర్షం కురిసింది. గత నాలుగు రోజుల నుంచి మార్కాపురం పట్టణంలో రాత్రిపూట 24 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, పిల్లలు వణికిపోతున్నారు. సోమవారం ఆకాశం మేఘావృతమై ముసురు పట్టడంతో పగలే చీకటి వాతావరణం ఏర్పడింది. ప్రజలతోపాటు చిరువ్యాపారులు కూడా ఇళ్లకే పరిమితమయ్యారు.

వర్షం కోసం రైతుల ఎదురుచూపులు

ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మంచి వర్షాలు కురుస్తాయని భావించిన రైతులు నిరాశకు గురయ్యారు. రబీలో మినుము, అలసంద, పొగాకు, మిర్చి పంటలతో పాటు కూరగాయల పంటలు పూత, పిందె దశలో ఉన్నాయి.

ఈ తరుణంలో పదును వర్షం కురిస్తే మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. నాలుగు రోజులుగా వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు సోమవారం ముసురు పట్టడంతో ఒకింత డీలపడ్డారు.

వీరబ్రహ్మేంద్ర ఆలయానికి నూతన పాలకవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకవర్గ సభ్యులు

పొదిలి: స్థానిక విరాట్ నగర్‌లోని గోవింద సమేత విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థాన నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం స్థానిక ఆలయంలో పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా మాచాబత్తుని గోవిందయ్య, ఉపాధ్యక్షులుగా రాచర్ల బ్రహ్మం, కార్యదర్శిగా యద్దనపూడి వీరబ్రహ్మం, సంయుక్త కార్యదర్శిగా ఎదురూరి బాలప్రసాద్, కోశాధికారిగా గుత్తికొండ కళ్యాణ్, సలహాదారులు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు సామంతపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన భక్తి భావం


గొట్లగట్టు చెరువు వద్ద మహిళల పూజలు


గంగమ్మ, గౌరమ్మను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

- ఆలయాల్లో పోలిస్వర్గ కార్తీక పూజలు

కొనకనమిట్ల: కార్తీక మాసం ముగింపు సందర్భంగా సోమవారం శివాలయాల్లో మహిళలు పోలిస్వర్గ పూజలు నిర్వహించారు. ముసురు కమ్ముకున్నప్పటికీ మహిళలు గొడుగులు వేసుకుని మరీ పూజలు చేశారు.

పొదిలి శివాలయంలో..

పొదిలి: పవిత్ర కార్తీక మాసం చివరి రోజున స్థానిక నిర్మమహేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలి స్వర్గం పర్వదినం సందర్భంగా సోమవారం భక్తులు అభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు, మాలధారులు పూజల్లో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.

సకల దీక్షా స్వాములకు చద్ది

స్థానిక నిర్మమహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సకల దీక్షా స్వాములకు చద్ది ఏర్పాటు చేశారు. ఎడమకంటి వెంకటేశ్వరరెడ్డి, రమణమ్మ, కుమారుడు అయ్యప్పరెడ్డి ఉభయదాతలుగా వ్యవహరించారు.


పొదిలిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆలయ పూజారి మురళీ కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం ఉభయదాతలను గురుస్వాములు ఘనంగా సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ, గౌరమ్మ నిమజ్జనం

గిద్దలూరు రూరల్: కార్తీక మాసం సందర్భంగా పట్టణంలోని అంకాలమ్మ ఆలయంలో నెలరోజుల పాటు పూజలందుకున్న గంగమ్మ, గౌరమ్మలను భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు. మండలంలోని కె.ఎస్.పల్లె సమీపంలో భీమలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గల సగిలేరులో సోమవారం నిమజ్జన క్రతువును పూర్తి చేశారు. ముందుగా మహిళలు గంగమ్మ, గౌరమ్మ ప్రతిమలను కుమ్మరాంకట్ట సెంటర్ వరకు ఊరేగించారు. అనంతరం సగిలేరు వాగు వద్దకు తరలించారు.


పెదారికట్ల శివాలయంలో..

కారు ఢీకొని మహిళకు గాయాలు

పొదిలి రూరల్: రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పొదిలి మండలంలోని మల్లవరం రాజీవ్‌నగర్ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దేశిరెడ్డి నాగలక్ష్మమ్మ రోడ్డు దాటుతుండగా దర్శి నుంచి పొదిలి వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగలక్ష్మమ్మను స్థానికులు 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆనందాశ్రమంలో పూజలు

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో మార్గశిర శుద్ధ తొలి పాడ్యమి పూజలు ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో వెలసిన శ్రీ గోవిందమాంబ సమేత వీర బ్రహ్మేంద్ర స్వామి, కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వాముల వారికి పంచామృత అభిషేకాలు, బిల్వార్చనలు జరిపారు. మహా గణపతి సుబ్రమణ్యేశ్వర స్వామికి, అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు, పడి పూజ, కోటి దీపారాధనలు, సహస్ర దీపార్చనలు సమర్పించి సామూహిక హారతులిచ్చారు. దొనకొండ వాస్తవ్యులు మాడిశెట్టి నారాయణ, పార్వతి, పవన్‌కుమార్, బాలకుమారి, వెంకటేశ్వర్లు, దుర్గాభవాని దంపతులు దీపారాధన కార్యక్రమం జరిపించారు. మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, రమాదేవి దంపతులు అల్పాహారం ఏర్పాటు చేశారు. గురు స్వాములు చెన్నం శెట్టి వెంకట్రావు, ఎంపీపీ బొరిగొర్ల ఉషా మురళి దంపతులు పూజలో పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కిట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

మార్కాపురం టౌన్:

ఎయిడ్స్‌పై ప్రజలందరు అవగాహన కలిగి ఉండాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అన్నా కృష్ణ చైతన్య పేర్కొన్నారు. సోమవారం కిట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మార్కాపురం, పెద్దారవీడు మండలాల్లో ఎయిడ్స్‌పై ర్యాలీ, అవగాహన కార్యాక్రమాలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రంగనాయకులు, ఏవో బి.ప్రభాకర్, హెచ్‌ఓడీలు పి.రామ్మోహన్, డాక్టర్ జెవి అనిల్ కుమార్, కిషోర్‌బాబు, ప్రసన్న మురళి, రమణారెడ్డి, అమృతవల్లి, మనోహర్, పీడీ రంగస్వామి, ఎన్‌వీఎస్ఎన్ అంజనీ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.